## క్లుప్తంగా

### నెట్టికంటుడికి రూ.1.02 కోట్ల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న దృశ్యం

**గుంతకల్లు రూరల్:** తల నీలాల టెండర్ ద్వారా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.1.02 కోట్ల ఆదాయం లభించినట్లు ఈఓ కె.వాణి తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకూ ఆలయంలో నిర్వహించే వివిధ రకాల పనుల కోసం సోమవారం బహిరంగ వేలం పాటతోపాటు, షీల్డు, ఈ–టెండర్లను నిర్వహించారు. టెండర్లలో భాగంగా నిర్వహించిన బహిరంగ వేలం పాటలో ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన యాదగిరి అనే వ్యక్తి తలనీలాల టెండర్‌ను రూ.1,02,06,000కు దక్కించుకున్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో నిద్రించే భక్తులకు చాపలు, బెడ్‌షీట్లు సప్లై చేసే టెండర్‌ను కసాపురం గ్రామానికి చెందిన పాపిరెడ్డి అనే వ్యక్తి 5.22 లక్షలకు దక్కించుకున్నారు.

### బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**యల్లనూరు:** మండల కేంద్రంలో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయని ప్రధాన అర్చకుడు విజయ రాఘవన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అంకురార్పణం, ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభించామన్నారు. 18న సింహ వాహనం, 19న శేష వాహనం, 20న హనుమంతవాహనం, 21న గరుడ వాహనం, 22న కల్యాణోత్సవం, 23న రథోత్సవం, 24న అశ్వ వాహనం, 25న వసంతోత్సవం, హంసవాహనం, 26న ఏకాంతోత్సవం సేవలు కొనసాగుతాయన్నారు.

### కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ



ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులతో నిర్వాహకులు

**తాడిపత్రి:** ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తాడిపత్రికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు తాడిపత్రి మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఆదివారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని పోలీస్ ఫంక్షన్ హాల్‌లో ఏపీ టెక్నికల్ డైరెక్టర్, జేఎస్‌కేఎస్ కులశేఖర్ మాస్టర్ నిర్వహించిన ఈ పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి 480 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అండర్ 11, 14 విభాగంలో తాడిపత్రి మండలంలోని గన్నెవారిపల్లి కాలనీలో ఉనన మార్షల్ ఆర్ట్స్ జపాన్ షూటోరియా కరాటే ట్రైనింగ్ ఇన్సిస్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభ కనబరచి, ప్రథమ, ద్వితీయ శ్రేణుల్లో గెలుపొందారన్నారు. విజేతలకు ఏపీ టెక్నికల్ డైరెక్టర్ కులశేఖర్ మాస్టర్, ప్రభాకర్ మాస్టర్లు కప్, సర్టిఫికెట్లు అందించారన్నారు. టీం కోచ్‌గా రాగశ్రీ వ్యవహరించారన్నారు.

### బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లోకనాథశర్మ



**గుంతకల్లు రూరల్:** బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుంతకల్లుకు చెందిన టీవీ లోకనాథశర్మ ఎన్నికయ్యారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలోని ఆర్య వైశ్యవాసవీ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణసేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాలుగు సంవత్సరాల పాటు పదవీకాలం గల ఈ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన కోనూరు సతీష్ శర్మ నియామకం కాగా, ఉపాధ్యక్షుడిగా టీవీ లోకనాథ్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా హెచ్‌కే మనోహర్, కోశాధికారిగా ప్రసాదశర్మ ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కాగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా కొనసాగిన లోకనాథ శర్మ ఆలయ అభివృద్ధికోసం ఎంతో కృషి చేశారు.

### వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆత్మ పీడీ మద్దిలేటి

**గుత్తి:** పట్టణంలోని వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లో సోమవారం గృహాల్లో వర్మీ కంపోస్టు తయారీ విధానంపై రైతు సేవా కేంద్రాల సిబ్బంది(వీహెచ్‌ఏ, వీఏఏ,వీఎస్‌ఏ)కి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏడీఏ వెంకటరాముడు అధ్యక్షతన అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వర్మీ కంపోస్టు తయారీ విధానం, కిచెన్ గార్డెన్ కిట్స్ పెంపకం, టెర్రస్ గార్డెన్ పెంపక విధానాలపై పీడీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ శైలజా కుమారి, ఏఓ శ్రీనివాసులు, ఏఈఓ కృష్ణ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో బస్టాండ్

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన పామిడి ఆర్టీసీ బస్టాండ్



కూలడానికి సిద్ధంగా మరుగుదొడ్లు



బస్టాండ్ ఆవరణలో పులి, మేక జూదం ఆడుతున్న దృశ్యం

**పామిడి:** పట్టణంలోని బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 1991 ఆగస్టు 20న పామిడి బస్‌స్టేషన్ సముదాయాన్ని ప్రారంభించారు. అప్పట్లో పట్టణానికి వెలుపల కావడంతో బస్టాండ్ ప్రాచుర్యానికి నోచుకోలేదు. కాలక్రమేణా బస్టాండ్ ఏరియా ప్రాంతంలో కాలనీలు వెలిసి అభివృద్ధికి నోచుకుంది. అప్పటికే బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో ప్రయాణికులు ఎవ్వరూ బస్టాండ్ వైపు చూచిన పాపానపోలేదు. అప్పట్లో నిరుపయోగంగా మారిన బస్టాండ్‌పై పలుమార్లు సాక్షిలో కథనాలు ప్రచురించడం జరిగింది. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో కంట్రోలర్‌ను ఏర్పాటు చేసి బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా తీసుకున్న చర్యలు తాత్కాలికమే అయ్యాయి. దీంతో తిరిగి బస్టాండ్ నిరుపయోగస్థితికి చేరుకుంది. ప్రస్తుతం బస్టాండ్ ఆవరణమంతా హోటళ్లు, వెల్డింగ్, ఎలక్ట్రికల్ ఇతరత్రా షాపులమయమైంది.

**ఆర్టీసీ బస్టాండ్ స్థలం అన్యాక్రాంతం**

పట్టణ సర్వేనంబర్ 426–ఏ2 లోని 2 ఎకరాలను ఆర్టీసీ బస్టాండ్‌కు కేటాయించారు. అందులో ఆర్టీసీ బస్టాండ్ సముదాయం కింద ప్రయాణికులు వేచి ఉండేందుకు, మురుగుదొడ్లు, కంట్రోలర్ గది, హోటళ్లు, స్టేషనరీ షాపుల నిమిత్త నిర్మాణానికి సంబంధించి దాదాపు 25 సెంట్లలో ఆర్టీసీ బస్టాండ్ సముదాయం చేపట్టారు. మిగతా 1.75 ఎకరాల ఆవరణంలో బస్సుల రాకపోకలకు సంబంధించి ఇన్ కమింగ్, అవుట్ గోయింగ్ ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఆర్టీసీ బస్టాండ్‌కు కేటాయించిన స్థలంలో దాదాపు 25 సెంట్లు, దాని ఆనుకొని ఉన్న సర్వేనెంబర్ 426–ఏ3లో దాదాపు 65 సెంట్ల పంచాయితీ స్థలంలో అక్రమ భవనాలు నిర్మించినా అధికారులు ఎవ్వరూ పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. 25 సెంట్ల ఆర్టీసీబస్టాండ్ స్థలంతో పాటు సర్వేనెంబర్ 426ఏ–3లోని 65 సెంట్లతో కలిపి మొత్తం దాదాపు 90 సెంట్లు అన్యాక్రాంతమైందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అక్రమ భవనాలకు పంచాయితీ అధికారులే దగ్గరుండి సీసీ రోడ్డు ఏర్పాటుయత్నంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

**అసాంఘిక కార్యకలాపాలకు నిలయం**

అప్పుడప్పుడు అనంత, గుత్తి డిపో పల్లె వెలుగు బస్సులు మినహా పూర్తిగా బస్టాండ్‌లోకి బస్సులు రావడం లేదు. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌లోకి రావాలంటే సైతం సాహసించ లేకపోతున్నారు. ఎందుకంటే అసాంఘిక కార్యకలాపాలకు, రౌడీమూక, అల్లరిమూకకు అడ్డాగా మారింది. పేకాట, మట్కా, పులి, మేక వంటి జూదాలు ఆడుతూ అల్లరిమూకలు అక్కడే తిష్ట వేస్తుండడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అలాగే బస్టాండ్ లోపల, వెలుపల మొత్తం వ్యాపార దుకాణాలు వెలిశాయి. దీంతో ప్రయాణీకులకు కేరాఫ్‌గా ఉండాల్సిన బస్టాండ్ కాస్తా వ్యాపార కేంద్రంగా మారింది. ప్రయాణికుల నిమిత్తం నిర్మించిన బస్టాండ్ కాస్తా బిజినెస్ సెంటర్‌గా మారడంతో ప్రయాణికులు బస్సుల కోసం మండుటెండలో రోడ్లపై వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది

**రికార్డులు కనిపించడం లేదు**



సర్వేనెంబర్ 426–ఏ3 ప్రభుత్వ స్థలంకు సంబంధించి రికార్డులు కనిపించడం లేదు. డీ–గ్రేడ్ నగర పంచాయితీ నుంచి పామిడి మేజర్ పంచాయతీగా డీగ్రేడ్ అవ్వడంతో రికార్డులు ఎక్కడ పెట్టారో? అర్థం కావడం లేదు. ఆ రికార్డుల కోసం ఆరా తీస్తున్నాం. రికార్డుల ఆధారంగా ప్రభుత్వ స్థలమైతే స్వాధీనం చేసుకుంటాం.

–ఎం గోపాల్, ఈఓ, పామిడి.

**వినియోగంలోకి తీసుకురండి**



ఆర్టీసీ బస్టాండ్ కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. పూర్తిస్థాయిలో బస్టాండ్‌లోకి బస్సులు రావడం లేదు. దీంతో మండుటెండలో ప్రయాణికులు రోడ్లుపై నిలుచుని బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. బస్టాండ్‌ను పూర్తిస్థాయిలో రూపుదిద్ది ప్రయాణికుల కోసం వినియోగంలోకి తీసుకురావాలి.

–వీ బుజ్జిబాబు, పామిడి

**ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం**



పామిడి ఆర్టీసీ బస్టాండ్‌కు కేటాయించిన స్థలంలో 25 సెంట్లు, దాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో దాదాపు 65 సెంట్లతో కలిపి మొత్తం 90 సెంట్ల స్థలం అన్యాక్రాంతమవ్వడంపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అక్రమ భవనాలకు పంచాయతీ నిధులతో అధికారులు సీసీ రోడ్డు వేయడానికి పూనుకోవడం విడ్డూరం. –వీ వెంకటేష్, పామిడి

**అన్యాక్రాంతం కాలేదు**



పామిడి సర్వేనెంబర్ 426–ఏ2లో కేటాయించిన 2 ఎకరాలకు సంబంధించి ఆర్టీసీ స్థలం అన్యాక్రాంతం కాలేదు. ఎందుకంటే ఆర్టీసీ జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలోనే రెండు పర్యాయాలు మండల సర్వేయర్ బృందంచే సర్వే చేయించాం. ఆర్టీసీ అధికారులు సైతం సర్వేపై సంతృప్తి వ్యక్తం చేశారు. –ఎన్.శ్రీధరమూర్తి, తహసీల్దార్, పామిడి

## 'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణకు స్వస్తి పలకాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

**గుంతకల్లు:** విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ విధానానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్తి పలకాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో పట్టణ సీపీఐ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, సహయ కార్యదర్శి మహేష్, పట్టణ, రూరల్ కార్యదర్శులు గోపీనాథ్, రాముడు రాయల్ మాట్లాడుతూ కేంద్రలో ఎన్‌డీఏ ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయాలని కంకణం కట్టుకుందని ఆరోపించారు. ఇక కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకమాట..అధికారం చేపట్టిన తరువాత మరోమాట మాట్లాడం పరిపాటిగా మారిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ విధానానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌ఎండీగౌస్, ఈశ్వరయ్య, దేవేంద్ర, నందు, ప్రసాద్,పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**చలో విజయవాడ పోస్టర్లు విడుదల..**

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ, రూరల్ కార్యదర్శులు గోపీనాథ్, అగ్రిగోల్డ్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు.

## విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలి



ప్రధానోపాధ్యాయుడిపి సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

**బుక్కరాయసముద్రం:** ఇంజినీరింగ్ విద్యార్థులు చదువులతో పాటు సామాజిక సేవా గుణం అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. సోమవారం మండలంని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నీలాంపల్లి గ్రామంలఏడు రోజుల పాటు జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ యూనిట్–4 ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఉన్నత చదువులు చదివినా సామాజిక రంగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామంలో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఏడు రోజుల పాటు నిరుద్యోగం, అక్షరాస్యత సర్వే, స్వచ్ఛ భారత్, ప్లాస్టిక్ నివారణ, వడదెబ్బ, వాటి నివారణ మార్గాలు డిజిటల్ లావాదేవిలు, నీటి సంరక్షణ, స్వయం ఉపాధి, పథకాల అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం సర్పంచ్ రసూల్‌బీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట రాముడును సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హమాద కుమారి, ఈఈఈ విభాగం అధిపతి డాక్టర్ మేరిమాత, లైబ్రేరియన్ లక్ష్మీ, అరవింద్ బాబు, మధుసూదన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలు ప్రారంభం



గుంతకల్లులోని ఎస్‌జేపీ ప్రభుత్వ పాఠశాల వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పామిడిలో పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

**గుంతకల్లుటౌన్/గుత్తి/పామిడి/తాడిపత్రిటౌన్/పెద్దవడుగూరు/శింగనమల/గార్లదిన్నె/యల్లనూరు/బుక్కరాయసముద్రం:** గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులను అధికారులు చెక్ చేసిన తర్వాతే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇచ్చారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

- గుంతకల్లు పట్టణంలోని ఎనిమిది పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 2,225 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. మొదటి రోజు లాంగ్వేజీ పరీక్షకు 19 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ మస్తాన్‌రావు తెలిపారు.
- గుత్తిలో ఆరు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 1566 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 31 మంది గైర్హాజరైయ్యారని ఎంఈఓ రవి నాయక్ తెలిపారు.
- పామిడిలో టీసీహైస్కూల్, ఎస్ఎఫ్ఎస్, సరస్వతీ ఉన్నత విద్యామందిరం, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. మొదటిరోజు ఈ నాలుగు పరీక్షా కేంద్రాలకు సంబంధించి 775 మంది విద్యార్థులకు గాను ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు చీఫ్‌లుగా శ్రీనివాస్, హరినాథ్, మహాలక్ష్మి, విశ్వనాథ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా వెంకటనాయుడు, శివప్రసాద్‌నాయుడు, రాఘవేంద్ర, మధుకర్ వ్యవహరించారు.
- తాడిపత్రి పట్టణంలో ఏడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. 2,394 మంది విద్యార్థులకు గానూ తొమ్మిది మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ నాగరాజు తెలిపారు.
- పెద్దవడుగూరులోని రెండు కేంద్రాల్లో 'పది' పరీక్షలు నిర్వహించారు. జెడ్పీ పాఠశాలలో 222 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 220 మంది హాజయ్యారు. సరస్వతి హై స్కూల్‌లో 250 మంది విద్యార్థులకు 247 మంది హాజరయ్యారని ఎంఈఓ–2 గురుప్రసాద్ తెలిపారు.
- శింగనమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 293 మంది విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 137 మంది విద్యార్థులకు గాను 137 మంది, కేజీబీవీలో 140 మంది విద్యార్థులకు గాను 139 మంది హాజరైనట్లు ఎంఈఓ నరసింహరాజు తెలిపారు.
- గార్లదిన్నె మండలంలోని గార్లదిన్నె, కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్లో 624 మంది విద్యార్థులకు గాను 615 మంది పరీక్షలు రాశారు.అ ధికారులు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.
- యల్లనూరు మండలంలోని చిలమకూరు మోడల్ స్కూల్లో సోమవారం పది పరీక్షలు నిర్వహించారు. 305మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 298 మంది హాజరయ్యారు. డిపార్టుమెంట్ అధికారి మహేశ్వర్‌రెడ్డి, చీఫ్ అధికారిణి పంకజం మేరీ లీలా పరీక్షల తీరును పరిశీలించినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు.
- బుక్కరాయసముద్రం మండలంని బీకేఎస్ జెడ్పీ హైస్కూల్, అనంత విద్యానికేతన్ పాఠశాల, ఆర్డీటీ బధిరుల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను నిర్వహించారు. 737 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 11 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓలు నవీద, లింగా నాయక్ తెలిపారు.

### రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

**గుత్తి రూరల్:** మండలంలోని కరిడికొండ, ఊబిచెర్ల, జక్కలచెరువు, తొండపాడు గ్రామాల్లోని సచివాలయాల్లో ఈ నెల 19 నుంచి 28 వరకూ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 19, 20 తేదీల్లో కరిడికొండ, 21, 22న ఊబిచెర్ల, 25, 26న జక్కలచెరువు, 27, 28 తేదీల్లో తొండపాడు సచివాలయంలో ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు.ప్రజలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

**గుంతకల్లు రూరల్/గార్లదిన్నె/శింగనమల:** వేతనాలు అందక, పని ప్రదేశంలో సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధి కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణమూర్తి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ.శ్రీనివాసులు తదితరులు గుంతకల్లు మండలంలోని నెలగొండ, వెంకటాంపల్లి గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. మూడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందలేదన్నారు. పనిప్రదేశంలో కూలీలకు సరైన సౌకర్యాలు, పనిముట్లు లేకపోవడంతో పనులు చేయడానికి కూలీలు అవస్థలు పడుతున్నారన్నారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20,21 తేదీలో గ్రామ సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వారు హెచ్చరించారు. అలాగే గార్లదిన్నె మండలంలోని మర్తాడులో జరుగుతున్న ఉపాధి పనులను సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు సావిత్రమ్మ పరిశీలించి, కూలీల సమస్యలు తెలుసుకున్నారు. గత ఐదువారాలుగా బిల్లులు అందక ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నా పని ప్రదేశంలో నీడ, నీటి సౌకర్యం కల్పించకుండా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఓబిలేసు, క్రిష్టయ్య, షేక్షావలి, తాతయ్య, ఆదినా రాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శింగనమల మండలంలోని సలకంచెరువు నుంచి బైక్ యాత్రను వ్యవసాయ కార్మికులు ప్రారంభించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఉపాధి హామీ పథకం కింద 200 రోజులు పని దినాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 19 వరకూ బైక్ యాత్ర చేపడతామన్నారు. కార్యక్రమంలో సుంకన్న, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

**వేలం మళ్లీ వాయిదా**

**గుంతకల్లుటౌన్:** పట్టణంలో దిన, వారపు మార్కెట్, మాంసపు దుకాణాలు, జంతువధశాలల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కును లీజుకివ్వడానికి సోమవారం జరగాల్సిన బహిరంగ వేలం వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. ఈ నెల 19న ఉదయం 10:30 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. కాగా వేలం ఎందుకు వాయిదా వేస్తున్నారు? ఎప్పటికి వాయిదా వేస్తున్నారో కనీస సమాచారం ఇవ్వాల్సిన మున్సిపల్ రెవెన్యూ అధికారులు అందుబాటులో లేకపోవడంతో వేలంపాటదారులు మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యాలయం వద్దనే పడిగాపులు కాసి వెనుదిరిగారు.

**రేపు ద్విచక్రవాహనాల వేలం**

**గార్లదిన్నె:** స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ 23 ద్విచక్ర వాహనాలకు ఉన్నతాధికారుల సమక్షంలో వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా రూ.500 చెల్లించాలన్నారు.

**నేడు సామాజిక తనిఖీ గ్రామసభలు**

**యల్లనూరు:** మండలంలోని వెంకటాంపల్లి, మల్లాగుండ్ల, బుక్కాపురంలో మంగళవారం సామాజిక తనిఖీ గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఈసీ బబ్లు సోమవారం తెలిపారు. సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో తిరిగి తయారు చేసిన నివేదికలను గ్రామసభలో చదివి వినిపిస్తారన్నారు.

**20న మండల సమావేశం**

**బుక్కరాయసముద్రం:** ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 20న ఉదయం 10.30 గంటలకు మండల సర్వ సభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాల్మాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

**కల్యాణ మండపం పనుల పరిశీలన**

**తాడిపత్రి రూరల్:** పట్టణంలోని పార్వతీమాత సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న జీర్ణోద్ధరణ పనులను సోమవారం మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న కల్యాణ మండపాన్ని పునరుద్ధరిస్తున్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

## సంక్షిప్త సమాచారం

**ప్రభుత్వాస్పత్రి ఏఓపై చర్యలు తీసుకోవాలి**

**గుంతకల్లుటౌన్:** స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మహిళా చిరుద్యోగులు, కార్మికుల పట్ల వేధింపులకు పాల్పడటమే కాకుండా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆస్పత్రి ఏఓ రామ్‌ప్రసాద్‌పై చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌డేలో జేసీని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, నాయకులు రామాంజనేయులు, దావీద్, లింగమయ్య తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

**బస్టాప్ ఏర్పాటు చేయండి**



హెడ్ క్లర్క్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**గుత్తి:** పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో ఉన్న జెడ్ వీరారెడ్డి కాలనీ సమీపంలో బస్టాప్ ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు, కాలనీవాసులు సోమవారం అధికారులకు విన్నవించారు. సీపీఎం మండల కార్యదర్శి నిర్మల ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు, కాలనీవాసులు ఆర్టీసీ హెడ్ క్లర్క్ శ్రీపాద, మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు వినతి పత్రాలు అందజేశారు. జెడ్‌వీరారెడ్డి కాలనీలో సుమారు రెండు వేల మంది జనాభా ఉన్నారన్నారు. బస్టాప్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

**ఇసుక టిప్పర్ల సీజ్**

**గుత్తి:** ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు టిప్పర్లను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పట్టణ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు విచారణ చేపట్టారు.

**అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం పూర్తిచేయాలి**

**గుంతకల్లు రూరల్:** మండలంలోని కసాపురం గ్రామంలో నిర్మాణ దశలో నిలిచిపోయిన రెండు అంగన్‌వాడీ కేంద్రాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ గ్రామీణ పౌరసేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సభ్యుడు లాలిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో నాలుగు అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా ఎస్సీ కాలనీలోని రెండు సెంటర్లకు రెండు నూతన బిల్డింగ్‌లు మంజూరయ్యాయన్నారు. కానీ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సెంటర్లలో అటు పిల్లలు, ఇటు టీచర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

**దివ్యాంగులకు సరుకుల పంపిణీ**

**తాడిపత్రి రూరల్:** పట్టణంలోని పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం 20 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సభ్యులు మాట్లాడుతూ ప్రతి నెలా సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. సత్యప్రసాద్‌రెడ్డి, వీరారెడ్డి, అశ్వత్థరెడ్డి, వెంకట్రామయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

**15 టీంలు ఏర్పాటు**

**తాడిపత్రిరూరల్:** మునిసిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను, నీటి పన్నులతో పాటు ఇతర రకాల పన్నుల వసూళ్ల కోసం 15 టీంలను నియమించామని సోమవారం కమిషనర్ శివరామక్రిష్ణ తెలిపారు. 2024–25 సంవత్సరానికి పెండింగ్‌లో ఉన్న పన్నుల వసులు కోసం మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో కలిసి టీంలుగా ఏర్పాటు చేశామన్నారు. మునిసిపాలిటీలోని 36 వార్డుల్లో కమిటీల సభ్యులు తిరుగుతూ పన్నుల వసూలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు.

**వైద్యులను నియమించాలని వినతి**

**తాడిపత్రి:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యులను నియమించాలని కోరుతూ సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం మండల తహసీల్దార్ రజాక్ వలికి ఆయన వినతి పత్రం సమర్పించారు. తాడిపత్రి పట్టణంలో టైలర్స్ కాలనీ, పాత కోట, అంబేద్కర్‌నగర్ ప్రాథమిక కేంద్రాలకు దాదాపు రెండు సంవత్సరాలుగా వైద్యులు లేక పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర, సూరి, రమణ, రత్నమయ్య, అబ్రహం, నాగార్జున, శివ, తదితరులు పాల్గొన్నారు.